

శంఖారావం
కదిలిరండి.. తెలుగుదేశం కార్యకర్తలారా



● యుద్ధానికి సిద్ధం కావాలి

'అక్రమాలు ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. నాపై 22 కేసులు పెట్టారు. రెడ్ బుక్‌పైనా నాన్ బెయిల్‌బుల్ కేసు పెట్టారు. అయినా తగ్గేది లేదు. ఎన్ని కేసులైనా పెట్టుకోండి. భయపడేది లేదు. బాంబులకే భయపడలేదు. కేసులకు భయపడతామా..? సూపర్-6 హామీలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత టీడీపీ శ్రేణులపై ఉంది. సమయం లేదు మిత్రమా.. యుద్ధానికి సిద్ధం కావాలి. వచ్చే రెండు నెలలు కష్టపడి టీడీపీ- జనసేన ప్రభుత్వాన్ని గెలిపించాలి. మన మధ్య చిచ్చుపెట్టేందుకు వైసీపీ పేటీఎం బ్యాచ్ సిద్ధంగా ఉంది. నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.' అని నారా లోకేశ్ అన్నారు.

కబ్జాలు.. కేసులు

ఐదేళ్లలో ఇవి తప్ప ఒక్క అభివృద్ధి పనైనా చేశారా?

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నియోజకవర్గాన్ని పంచుకుతింటున్నారు
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజం
- పాలకొండలో శంఖారావం యాత్ర ప్రారంభం
- కురుపాం నియోజకవర్గంలోనూ సభ
- అంతటా విశేష స్పందన.. పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం





పాలకొండలో సభకు హాజరైన ప్రజలు

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)/ పాలకొండ/ వీరఘట్టం/సీతంపేట/గరుగుబిల్లి/కొమరాడ

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' యాత్రకు అపూర్వ స్పందన లభించింది. జిల్లా ఆవిర్భావం తర్వాత ఆయన తొలిసారిగా 'మన్యం'కు రావడంతో భారీగా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి.. ఆహ్వానం పలికారు. మంగళవారం మధ్యాహ్నం పాలకొండలో ఈ యాత్ర ప్రారంభించగా.. కురుపాం నియోజకవర్గంలోనూ కొనసాగింది. వైసీపీ సర్కారు వైఫల్యాలను ఎండగడుతూ.. సీఎం జగన్, మంత్రులు, ఎమ్మెల్యేల తీరుపై లోకేశ్ ధ్వజమెత్తారు. రానున్నది టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ.. ప్రజలకు భరోసా ఇచ్చారు.

వైసీపీ సర్కారు అరాచక పాలనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పూరించారు. తన ప్రసంగంతో పార్టీ జిల్లా శ్రేణులు, ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. వైసీపీ ప్రభుత్వ తీరుతో అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల వైఖరిపైనా ధ్వజమెత్తారు. మరో రెండు మాసాల్లో టీడీపీ - జనసేన ప్రభుత్వం వస్తుందని, ఉత్తరాంధ్రలో ప్రత్యేకంగా పార్వతీపురం మన్యం జిల్లాను అభివృద్ధి చేస్తామని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరుందిస్తామని చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం పాలకొండ శంఖారావం సభలో ఆయన ఇంకా ఏమన్నారంటే.. 'పాలకొండ ఎమ్మెల్యే రెండుసార్లు గెలిచినా ప్రజల జీవితాల్లో ఏ మార్పు రాలేదు. ఇక్కడ ఒక ఎమ్మెల్యేను గెలిపిస్తే బంపర్ ఆఫర్‌లా ఇద్దరు వచ్చారు. వారిద్దరు నియోజకవర్గాన్ని కట్ చేసుకొని పంచుకున్నారు. ఒక వైపు ఎమ్మెల్యే కళావతి, మరోవైపు ఎమ్మెల్సీ విక్రాంత్.. ప్రజలను పీడించుకు తింటున్నారు. పాలకొండలో కోట్లు విలువైన భూమిని బినామీ పేర్లతో రాయించుకున్నారు. నాగావళి, వంశధార నదిలోని ఇసుకను తోడేస్తూ అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిని కూడా ఓ ఇద్దరు నాయకులు కబ్జా చేశారు.' అని ఆరోపించారు.

నదుల అనుసంధానానికి కృషి

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పి వైసీపీ సర్కారు మాట తప్పింది. జిల్లాలో వంశధార, తోటపల్లి, నాగావళి ప్రాజెక్టులకు ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదు. వంశధార-నాగావళి అనుసంధానం చేసేందుకు చంద్రబాబు కృషి చేశారు. 72 శాతం పనులు పూర్తయ్యాయి. రోడ్లు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, పార్కులు నిర్మాణం చేసింది టీడీపీ ప్రభుత్వమే. తాను పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సోలార్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం.

పనులు పూర్తిచేస్తాం..

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నుంచి రోడ్డు మార్గంలో పాలకొండ వస్తుంటే.. 'ఆంధ్రా రోడ్లు బాగోలేవు... ఒడిశా రహదారులు బాగున్నాయి.. అటువైపు నుంచి వెళ్దాం' అని సెక్యూరిటీ సిబ్బంది చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రోడ్లను పట్టించుకోవడం లేదు. నిర్మాణం సంగతి సరేసరి.. కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయితే అందరూ రెండు నెలలు ఓపిక పడితే చాలు.. అన్ని రోడ్లు వేస్తాం. మొదటి వంద రోజుల్లోనే స్థానికులకు ఉద్యోగాల కల్పిస్తాం. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు కూడా ఏర్పాటు చేస్తాం. తోటపల్లి లెఫ్ట్ కెనాల్ పనులు, జంపరకోట రిజర్వాయర్ పనులు, నిలిచిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కూడా పూర్తి చేస్తాం..



పాలకొండ శంఖారావం సభలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడి వద్ద..

పథకాలన్నీ అమలు చేస్తాం

టీడీపీ అధికారంలోకి వస్తే గిరిజనులకు సంక్షేమ పథకాలన్నీ అందజేస్తాం. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చే వరకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తాం. ముగ్గురుంటే ఏడాదికి రూ.45 వేలు ఇస్తాం. ప్రతి రైతుకు అండగా ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తాం. 18 నుంచి 59 ఏళ్ల మహిళలు నెలకు రూ.1500 ఇస్తాం. ఐదేళ్లలో రూ.90 వేలు ఇచ్చి ఆదుకొనే బాధ్యత టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకుంటుంది.

నాడు నిధుల కేటాయింపు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.192 కోట్లతో తోటపల్లి ఆధునికీకరణ పనులు చేశాం. రూ.22 కోట్లతో జంపర కోట రిజర్వాయర్ పనులు పూర్తి చేశాం. సీతంపేటలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి కోసం రూ.4 కోట్లు కేటాయించాం. ఏజెన్సీ ప్రాంతాలకు 15 ఫీడర్ అంబులెన్స్‌లు మంజూరు చేశాం. గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు వేశాం. సీతంపేటలో రూ.3 కోట్లతో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ నిర్మించాం.



పాలకొండలో ఓ వృద్ధురాలు ఇలా..



గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడి వద్ద నిర్వహించిన సభకు హాజరైన టీడీపీ శ్రేణులు, అభిమానులు

కురుపాంలో ముగ్గురు ఎమ్మెల్యేలు..

కురుపాం నియోజకవర్గంలో ఓటు ఒకరికి వేస్తే.. ముగ్గురు ఎమ్మెల్యేలు తయారయ్యారని నారా లోకేష్ అన్నారు. గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడి వద్ద నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. 'కురుపాం నియోజకవర్గంలో ఇసుక దోపిడీకి అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. పుష్పశ్రీవాణిని ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే.. ఆమె భర్త శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మరిది రమేష్ కూడా ఎమ్మెల్యేలుగా చలామణి అవుతున్నారు. భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ పోస్టుల దగ్గర నుంచి కాంట్రాక్టు పోస్టుల వరకు అమ్ముకున్నారు. ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ, ఇరిగేషన్ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల కాంట్రాక్టులు ఎమ్మెల్యే మరిది రమేష్‌కే వెళ్తున్నాయి. పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. పుష్పశ్రీవాణిని రెండు సార్లు గెలిపిస్తే ప్రజలకు చేసింది ఏమీ లేదు. ఆమె మాత్రం భారీగా సంపాదన పెంచుకున్నారు. మంత్రిగా ఉండి కూడా పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయలేదు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేస్తాం. జిల్లావాసులను పీడిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరిస్తాం. వచ్చే ఎన్నికల్లో టీడీపీ - జనసేన తరఫున పోటీచేసే అభ్యర్థిని గెలిపించాలి. కురుపాం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించే బాధ్యత టీడీపీ-జనసేన ప్రభుత్వంపై ఉంది. వైసీపీ ప్రభుత్వంపై పోరాడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెడుతోంది. ప్రభుత్వం ఎన్ని ఎక్కువ కేసులు నమోదు చేసినా.. టీడీపీ - జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇస్తాం. పార్టీలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం.' అని ఆయన అన్నారు.

పార్వతీపురంలో బస...

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం రాత్రి పార్వతీపురం చేరుకుని బస చేశారు. బుధవారం పార్వతీపురం, సాలూరులో శంఖారావం యాత్ర నిర్వహించనున్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన

యాత్ర-2 సినిమాలో వైసీపీకి అంతిమ యాత్ర అని గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడి వద్ద నిర్వహించిన శంఖారావం సభలో నారా లోకేష్ అనగానే ప్రజలు, టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. జగన్ సైకో, భస్మాసురుడు, సద్దాం హుస్సేన్ లాంటి వ్యక్తి అనగానే హర్షాతిరేకాలు వినిపించాయి. వైసీపీ ప్రభుత్వ పనితీరుపై ఆరోపించిన సమయంలో కేరింతలు కొట్టారు. పాలకొండలో బహిరంగ సభ ముగించుకుని సాయంత్రం 5.46 గంటలకు లోకేశ్ ఉల్లిభద్రకు చేరుకున్నారు. సుమారు గంటకు పైగా పలు సమస్యలపై మాట్లాడి ప్రజలను ఆకట్టుకున్నారు. 9 బహిరంగ సభల్లో ప్రసగించానని, కొంతమేర గొంతు పట్టిందని లోకేశ్ అనగా.. గట్టిగా మాట్లాడాలని ప్రజలు కోరడంతో గొంతు సవరించుకుని ప్రసగించారు.

సాలూరులో సభా స్థలం పరిశీలన

సాలూరు, ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బుధవారం మధ్యాహ్నం సాలూరు విచ్చేయనున్నారు. శంఖారావం సభకు హాజరై ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో సాలూరులోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో సభా స్థలాన్ని మంగళవారం స్థానిక టీడీపీ నేతలు పరిశీలించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి, పార్టీ పరిశీలకులు విశ్వప్రసాద్ తదితరులు ఏర్పాట్లపై శ్రేణులతో చర్చించి తగు సలహాలు సూచనలు అందించారు. శంఖారావం సభకు భారీగా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ పరిశీలనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎన్.తిరుపతిరావు, నాయకులు పరమేష్, వేణు, యుగంధర్, ఎర్రినాయుడు, కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ పాలనకు నిదర్శనం.. ఈ రోడ్డు...

వైసీపీ సర్కారు పాలనకు నిదర్శనం ఈ రోడ్డు అని యువనేత లోకేశ్ అన్నారు. మంగళవారం పాలకొండ నుంచి కురుపాం శంఖారావం సభలో పాల్గొనేందుకు ఆయన వెళ్తుండగా మార్గమధ్యంలో వీరఘట్టం వద్ద కాన్వాయ్‌ను ఆపారు. అక్కడ కంకరపరిచి వదిలేసిన ఈ రహదారి చూసి సెల్ఫీ తీసుకున్నారు. జగన్ దిక్కుమాలిన పాలనకు ఇంతకంటే ఏం నిదర్శనం కావాలన్నారు. దీనిపై లోకేశ్ స్థానికులతో మాట్లాడగా.. కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడంతో రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ.1.80 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉందని లోకేశ్ చెప్పారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం తమ వల్ల కాదంటూ పరారైపోతున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు అడ్డగోలు దోపిడీపై తప్ప అభివృద్ధి పనులపై ఆసక్తి చూపడం లేదన్నారు.



వీరఘట్టంలో సగంలో నిలిచిన రోడ్డు నిర్మాణం చూపిస్తూ సెల్ఫీ తీసుకున్న లోకేశ్

భక్తజన శంబరం

- నాలుగో వారం జాతరకు పోటెత్తిన భక్తులు

మక్కువ/సాలూరు రూరల్, ఫిబ్రవరి 13: శంబర పోలమాంబ నాలుగోవారం జాతరకు భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. దాదాపు 38 వేల మందికి పైబడి భక్తులు రావడంతో వనంగుడి, చదురుగుడిలో క్యూలైన్లన్నీ కిక్కిరిసి పోయాయి. మరోవైపు గోముఖీ నది తీరంలో కొందరు అమ్మవారికి పూజలు చేసి మొక్కుబడులు చెల్లిం చుకున్నారు. సాలూరు నుంచి శంబరకు పది ఆర్టీసీ బస్సులను నడిపారు. రెండు కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ప్రదేశాల్లో ప్రైవేట్ వాహనాలను నిలిపివేయడంతో భక్తులు నడుచుకొని గుడికి చేరుకోవాల్సి వచ్చింది. సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు భద్రత విధులు నిర్వహించారు.





పోలమాంబ దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఉద్యోగుల ఉద్యమబాట

- నేటి నుంచి నిరసనలు
- 27న చలో విజయవాడ



పార్వతీపురంలో సమావేశమైన ఏపీ జేఏసీ ప్రతినిధులు

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)/ సాలూరు రూరల్: ఉద్యోగులు ఉద్యమబాట పట్టనున్నారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 14 నుంచి సమర శంఖం పూరించనున్నారు. ఉద్యోగ సంఘాలతో సోమవారం ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో జేఏసీ ఉద్యమ కార్యాచరణతో సమరానికి పిలుపు నిచ్చింది. ప్రధానంగా ఓపీఎస్ అమలు, 12వ పీఆర్సీ కమిటీ, 11వ పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏలు చెల్లింపు, ఆర్థిక బకాయిలు తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. 12 పీఆర్సీ ఆమోదించేలోగా 30 శాతం ఐఆర్ (మధ్యంతర భృతి) ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యమ బాటలో భాగంగా తొలుత ఈ నెల 14న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నారు. ఈ నెల 15, 16న మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు, ఈ నెల 17 అన్ని తాలూకా, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు చేయనున్నారు. ఈ నెల 20 కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేయనున్నారు, ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామని చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ హృదయరాజులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురంలో కార్యాచరణ సభ్యులతో మాట్లాడారు.

టీడీపీలో జోష్

- జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో లోకేశ్ 'శంఖారావం' విజయవంతం
- పెద్దఎత్తున తరలివచ్చిన టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు
- అభిమానులు, కార్యకర్తలతో నిండిన సభా ప్రాంగణాలు



కురుపాంలో టీడీపీ కండువా తిప్పుతూ కేడర్‌లో ఉత్సాహం నింపుతున్న లోకేశ్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్న వేళ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించిన శంఖారావం యాత్ర విజయవంతమైంది. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో సభలకు జనం పోటెత్తారు. దీంతో సభా ప్రాంగణాలు కిటకిటలాడాయి. పాలకొండలో శంఖారావ యాత్ర ఉత్సాహంగా సాగడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందానికి హద్దు లేకుండాపోయింది. పాలకొండలో నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, కురుపాం నియోజకవర్గంలో గరుగుబిల్లి మండలం ఎర్రన్నగుడి వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో శంఖారావం సభలు విజయవంతం అయ్యాయి.



పాలకొండ సభలో ఉత్సాహంతో పిడికిలి చూపిస్తున్న కార్యకర్తలు, ప్రజలు

గిరిజనులను మోసగించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న జగదీశ్వరి

గరుగుబిల్లి/కొమరాడ: కురుపాం నియోజకవర్గంలో రెండు దఫాలు అభిమానించిన గిరిజనులను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మోసగించారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. మంగళవారం ఉల్లిభద్ర సముదాయంలో లోకేశ్ నిర్వహించిన శంఖారావంలో ఆమె మాట్లాడారు. రెండు దఫాలు గెలిచిన ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. కురుపాం జనసేన పార్టీ ఇన్‌చార్జి కద్రక మల్లేష్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ముడుపులు తీసుకొని అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ప్రభుత్వంపై పోరాడిన వారికి నామినేటెడ్ పదవులు

వైసీపీ.. టీడీపీ కార్యకర్తలు, ప్రతినిధులపై అధికంగా కేసులు బనాయించిందని లోకేశ్ అన్నారు. ప్రభుత్వం అక్రమ కేసులు అధికంగా పెట్టినా.. బాధితులకు తాము అధికారంలోకి వచ్చిన నామినేటెడ్ పదవులు కల్పిస్తామని చెప్పారు. అరకు పార్టీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ తనపై బనాయించిన కేసులను లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన లోకేష్ కురుపాం నియోజకవర్గానికి సంబంధించి మొదటిగా నామినేటెడ్ పోస్టును అతనికే కేటాయిస్తామని ప్రకటించారు.

జేబుదొంగల హల్‌చల్

గరుగుబిల్లి/కొమరాడ: ఉల్లిభద్ర సముదాయంలో నిర్వహించిన శంఖారావం బహిరంగ సభలో జేబుదొంగలు హల్ చల్ చేశారు. సభ ముగించుకుని తిరిగి వెళుతున్న సమయంలో దొంగలు చేతికి పని చెప్పారు. పలువురి పర్సులు మాయమయ్యాయి. సుమారు పది మంది రూ.లక్షకు పైగా పోగొట్టుకున్నారు. ఆఖరి నిమిషంలో ఒక వ్యక్తిని గరుగుబిల్లి ఎస్ఐ అమ్మన్నరావుతో పాటు సిబ్బంది పట్టుకున్నారు. శంఖారావం బహిరంగ సభకు సుమారు 70 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, పది మంది హెచ్‌సీలతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేశామని చినమేరంగి సీఐ కె.మురళీధర్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ట్రైనీ డీఎస్పీ అజీజ్, గరుగుబిల్లి ఎస్ఐ అమ్మన్నరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆకర్షణీయంగా బెలూన్లు

శంఖారావం బహిరంగ సభలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన రెండు బెలూన్లు ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఏర్పాటు చేసిన బెలూన్లను పలువురు ఆసక్తిగా తిలకించారు.



కురుపాంలో శత్రుచర్లతో లోకేశ్



చిందులేస్తున్న కార్యకర్తలు

లోకేశ్‌కు ఘన స్వాగతం



ప్రజలకు అభివాదం చేస్తున్న లోకేశ్

పాలకొండ: శంఖారావం సభకు పాలకొండ నియోజకవర్గానికి విచ్చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. మధ్యాహ్నం రెండు గంటలకు లోకేశ్ శంఖారావం సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆయనకు జయకృష్ణ, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమా ర్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు గండి రామినాయు డు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, సవరతోట ముఖలింగం, జగదీష్. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో ఆహ్వానం పలికారు. అలాగే టీడీపీ నాయకులు పడాల భూదేవి, సామంతుల దామోదరరావు, ఖండాపు వెంకటరమణ, వారాడ సుమంత్‌నాయుడు, జనసేన నాయకులు పిసిని చంద్రమోహన్, నిమ్మల నిబ్రం, గర్భాపు సత్తిబాబు తదితరులు స్వాగతం పలికారు. భోజన విరామం సమయం తర్వాత 2.45 గంటలకు శంఖారావం సభకు చేరుకునే ముందుకు గ్యాలరీలో వేచి ఉన్న ఎంపీపీలు, జడ్పీటీసీలు, మహిళలకు కరచాలనం చేసి సభా వేదిక వద్దకు చేరుకున్నారు. అలాగే ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావుకు కూడా స్వాగతం పలికారు. లోకేష్ సభా వేదిక రాగానే టీడీపీ శ్రేణులు హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. లోకేష్ వారికి అభివాదం చేశారు.

ఘన సత్కారం

యువగళాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా నారా లోకేష్‌కు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సన్మాన పత్రాన్ని అందించారు. ఆయనతో పాటు పట్టణ నాయకులు సుంకరి అనీల్, శిల్లా గుప్త, అంపోలు శ్రీనివాసరావు, జవరాజు, వెంకటరమణ తదితరులు ఉన్నారు. అలాగే టీడీపీ నాయకురాలు పడాల భూదేవి నారా లోకేష్‌కు మెమెంటో అందించారు.

టీడీపీలో చేరికలు

లోకేశ్ ఆధ్వర్యంలో జయకృష్ణ సారథ్యంలో శంఖారావం సభా వేదిక వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు హనుమంతు తమ్మారావుతో కలిసి 120 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఎన్‌కే రాజపురానికి చెందిన వైసీపీ నాయకుడు నీలాపు అప్పారావునాయుడు ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. అలాగే వైసీపీ భాసూరు మాజీ సర్పంచ్ లెంక అప్పలనాయుడు టీడీపీలో చేరారు. వీరఘట్టం మాజీ జడ్పీటీసీ గేదెల రమేష్ లోకేష్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరితో పాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీ కండువాను కప్పుకున్నారు.

సమస్యలపై వినతిపత్రాలు..

గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణ వైద్య సేవలు ప్రాక్టీషనర్లకు జీవో నెంబర్ 429, 469 ప్రాప్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆరోగ్య సేవా పథకాల్లో సిబ్బందిగా ప్రకటించారని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని, మళ్లీ పునరుద్ధరించాలని, గ్రామీణ వైద్య సేవలు జాతీయ ఉపాధ్యక్షుడు పాలవలస రామినాయుడు తదితరులు లోకేశ్‌కు వినతిపత్రాలు అందించారు. అలాగే వీరఘట్టం మండలం బిటివాడకు చెందిన ఉంకూరు వెంకటరమణ అనే నిరుద్యోగ వికలాంగ యువకుడు డిగ్రీ పూర్తి చేశాడని, తన కుమారుడికి ఉద్యోగం కల్పించాలని కోరారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉపాధి కల్పిస్తానన్నారు. పలువురు లోకేశ్ ముందు వినతిపత్రాలు అందించారు.



లోకేశ్‌కు హారతులిస్తున్న మహిళలు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కుటుంబాలతో వెనుకబాటు

- టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ



పాలకొండ/ వీరఘట్టం/ సీతంపేట: వైసీపీ పాలనలో పాలకొండ నియోజకవర్గం రెండు కుటుంబాల కారణంగా వెనుకబడిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ విమర్శించారు. వీరిలో ఒకరు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రెండో వారు ఎమ్మెల్యే కళావతి అని అన్నారు. వీరు అభివృద్ధిని మరిచిపోయారన్నారు. భూ కబ్జాలు, ఇసుక మాఫియా, దొంగలిద్దరూ ఊళ్లను పంచుకుంటున్నట్టు పరిస్థితి ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పాలకొండ ఏరియా ఆసుపత్రిని 500 పడకల ఆసుపత్రిగా మార్చాలని లోకేష్‌ను కోరారు. వీరఘట్టం మండలానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని.. తోటపల్లి ఎడమ కాలువను పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. జగతిపల్లి రిసార్ట్స్‌ను పూర్తి చేసి స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్కామ్‌ల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు



జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని స్కామ్‌ల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు. అరాచక ప్రభుత్వాన్ని పారదోలేందుకు లోకేషన్న శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2019లో వైసీపీ దుర్మార్గపు ప్రభుత్వం వచ్చాక గిరిజన ప్రాంతం 30 ఏళ్లు వెనక్కిపోయింది. అరకు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ప్రజలు టీడీపీ-జనసేన వెనుక నడిచేందుకు సిద్ధం గా ఉన్నారు. మా నాన్న నక్సలైట్ల కాల్పుల్లో చనిపోతే నన్ను ఎమ్మెల్యేను, మంత్రిని చేసింది టీడీపీ. పాలకొండ నియోజకవర్గంలో పసుపు జెండా ఎగరాల్సిన అవసరం ఉంది.

- కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకు పార్లమెంటరీ అధ్యక్షుడు

వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు



పాలకొండలో శంఖారావం సభకు హాజరైన ప్రజలను చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అయిదేళ్లుగా ఎమ్మెల్యే కళావతి నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. పాలకొండ నియోజకవర్గంలో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు లేవు. సీతంపేట మండలంలో గిరిజనుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడానికి టీడీపీ, జనసేన ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. గిరిజన ఎమ్మెల్యే ఉండి... గిరిజనుల సమస్యలను గాలికొదిలేశారు. పాలకొండ నియోజకవర్గంలో పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలి.

- నిమ్మల నిబ్రం, జనసేన సమన్వయకర్త

స్వాగతం పలికిన విజయచంద్ర



లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గంలో శంఖారావం కార్యక్రమానికి మంగళవారం రాత్రి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు టీడీపీ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

- విజయచంద్ర నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన నుంచి నియోజకవర్గం పరిధిలో ఉన్న పార్వతీపురం పట్టణంతో పాటు పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో పార్టీ పటిష్టతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యలవుతున్నారు.

పార్టీ మీద ఉన్న అభిమానంతో...





విజయ సంకేతం చూపుతున్న వెంకటరమణ, లోకేశ్‌తో మాట్లాడుతున్న అప్పలనాయుడు

సీతంపేట: టీడీపీ మీద ఉన్న అభిమానంతో శంఖారావం సభకు వచ్చామని దివ్యాంగులైన బిట్టువాడ గ్రామానికి చెందిన వెంకటరమణ, మెంటు గ్రామానికి చెందిన అప్పలనాయుడు తెలిపారు. పాలకొండలో మంగళవారం లోకేశ్ నిర్వహించిన శంఖారావం బహిరంగ సమావేశా నికి వారు హాజరయ్యారు. తాను 13 కిలోమీటర్లు దూరం నుంచి ట్రై సైకిల్ మీద వచ్చానని అప్పలనాయుడు తెలిపారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ రావాలని తాము కోరుతున్నామని వారు స్పష్టం చేశారు.



పార్టీలోకి చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న లోకేశ్



విజయ సంకేతం చూపిస్తున్న మహిళలు

తనిఖీలు పెంచాలి: కలెక్టర్

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నేపథ్యంలో గంజాయి, మద్యం, డ్రగ్స్, డబ్బు రవాణాను నిరోధించడానికి తనిఖీలు పెంచాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి సాగు, రవాణా నిరోధించడానికి తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఏడాది జనవరి 4న జిల్లాలో నాలుగు రీచ్‌లకు అనుమతులు ఇచ్చామని, అయితే వారు రాష్ట్ర స్థాయిలో అన్ని అనుమతులు పొందిన తర్వాతనే ఇసుక తవ్వకాలకు అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ వేతనదారుల సంఖ్య పెంచాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర, సీతారాంపురం, కొంకడివరం పంచాయతీల్లో ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. మస్తర్లలో వ్యత్యాసాలు ఉంటే సహించేది లేదన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీల పరిధిలోగల పోలింగ్ కేంద్రాల్లో అసౌకర్యం కలగకుండా ఉండేలా అవసర మైన చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ కె.జయ తెలిపారు. మండలంలోని పిట్టలమెట్ట, సంతోషపురం, కొంకడివరం, సీతారాం పురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి సంబంధించి 49 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని చెప్పారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

గరుగుబిల్లి: మండలంలో రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నెలకొనకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో పైల సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.గౌరీశంకరరావు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ క్రాష్ ప్రోగ్రాం కార్యక్రమానికి సంబంధించి అవసరమైన బోరు సామగ్రిని కొనుగోలు చేశామని చెప్పారు. ఈ మేరకు కొనుగోలు చేసిన పరికరాలను ఆయా పంచాయతీలకు అందిస్తున్నామని తెలిపారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తిస్తామని చెప్పారు. బోరుబావులు పాడయితే తక్షణమే మండల కార్యాలయానికి సమాచారం అందిస్తే బాగు చేయిస్తామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి పార్వతీపురానికి చెందిన పీవీసీ రామలక్ష్మి రూ.లక్ష విరాళంగా అందించారని ఆలయ అభివృద్ధి ట్రస్టు ప్రతినిధులు డా.డి.పారినాయుడు, డి.ధనుంజయరావు తెలిపారు. పార్వతీపురానికి చెందిన ప్రముఖ వైద్యుడు, దివంగత శేషగిరిరావు జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందించారని చెప్పారు.

ఆశాలుగా మార్పు చేయాలి

సీతంపేట: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో ఐటీడీఏల వద్ద సామూహిక నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు 10వేల వేతనం పెంచాలని, లేనిపక్షంలో సామాజిక నిరాహార దీక్ష తీవ్రతరం చేస్తామని చెప్పారు. అనంతరం నిరవధిక దీక్ష సమ్మె నోటీసును ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డికి అందించారు. సీఐటీయూ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు

జియ్యమ్మవలస: ప్రజారోగ్యం దృష్ట్యా గ్రామీణ స్థాయిలోనే అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. అల్లువాడ గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య వివరాలు నమోదు రికార్డులను తనిఖీ చేసి, తగు సూచనలు చేశారు. అనంతరం ఆర్‌ఆర్‌బీ పురం పీహెచ్‌సీతో పాటు చినమేరంగి సీహెచ్‌సీలో ల్యాబ్ పరీక్షలు, ఓపీ వివరాలు పరిశీలించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా తెలుసుకుని తగు చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షేత్ర స్థాయిలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి, వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శంకర్, జగదీష్, ఏఎంవో సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ పరిశీలన

కురుపాం: దోమల వ్యాప్తి నివారణ కోసం స్థానిక కేజీబీవీలో నిర్వహించిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు పర్యవేక్షించారు. వసతి గృహాల్లో విద్యార్థులు జ్వరాలు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఏసీఎం 5శాతం మందును ఫోకల్ స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్య సిబ్బంది చేపట్టిన రక్త పరీక్షల నమూనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. ఏఎంవో సూర్యనారాయ ణ, సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఐ.కిరణ్‌కుమారి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికులే మన దేవుళ్లు

పార్వతీపురంటౌన్: 'మనందరికీ ప్రయాణికులే దేవుళ్లని ప్రతిఒక్కరూ గుర్తుం చుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ జోన్-1 ఈడీ రవికుమార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతరం మాసోత్సవాలను పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఆ సంస్థ ఓసీ అప్పలనాయుడు, సీఎంఈ శ్రీనివాసరావు, డీపీటీవో సుధాకర్, డీఎం దుర్గా పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేత

గుమ్మలక్ష్మీపురం: స్థానిక పెన్షనర్ల సంఘం చొరవతో కురుపాం ట్రెజరీ సిబ్బంది మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లను వారి ఇంటి వద్దకే వెళ్లి అందించారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, భద్రగిరి, పి.లేవిడి గ్రామాల్లో పలువురు పేషెంట్లకు, వృద్ధులకు సర్టిఫికెట్లను అందించారు.

నేరాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: బ్యాంకుల్లో నేరాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని సెంట్రల్ క్రైం స్టేషన్ మన్యం జిల్లా సీఐలు ఎం.అప్పారావు, సుధాకర్ కోరారు. మంగళవారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణంలోని అన్ని బ్యాంకు శాఖల మేనేజర్లతో సీసీఎస్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐలు మాట్లాడుతూ బ్యాంకు ఆవరణలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాంకుల్లో నేరాలు జరగకుండా 24/7 భద్రతా గార్డులు నియమించాలని సూచించారు. సీసీఎస్ ఎస్ఐలు రమణారావు, రమణారెడ్డి, పీవీపీ టౌన్ ఎల్అండ్‌వో ఎస్ఐ రవీంద్రరాజు, సీసీఎస్ పీసీ ఉదయ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు రూ.99.90 కోట్లు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కలెక్టర్ కార్యాలయం నిర్మాణానికి రూ.99.90 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని అడ్డాపుశిలలో నిర్మించడానికి నిధులు మంజూరు చేసింది. ఉత్తర్వులు జారీ చేయడంపై కలెక్టర్ సంతోషం వ్యక్తంచేశారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం: లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 100 మద్యం సీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జలాశయంలో మునిగి బాలుడి మృతి

ఒడిశా

రాయగడ: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సిల్బిగుడ జలాశయంలో మునిగి సాయిప్రియనగర్‌కు చెందిన చైతన్య (17) అనే బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిల్బిగుడ వద్ద ఉన్న మైదా నంలో క్రికెట్ ఆడేందుకు ఆదివారం తోటి స్నేహితులతో కలిసి చైతన్య వెళ్లాడు. కాసేపు క్రికెట్ ఆడాక డ్యామ్‌లో ఈత కొట్టేందు కు దిగాడు. నీటి మధ్యలో ఉన్న ఇసుక తిన్నె వరకు వెళ్లి అక్కడ కాసేపు సేద తీరాడు. కాసేపటి తర్వాత చూస్తే బాలుడు కని పించలేదు. దీంతో స్నేహితులు విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేశారు. అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం చైతన్య మృతదేహం లభిం చింది. చైతన్య అంతకు ముందే రక్తదానం చేశాడని తల్లిదండ్రు లు తెలిపారు. రక్తదానం చేసిన కొద్దిసేపటికి ఈత కొట్టడం వల్ల గుండెపోటు వచ్చి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవుల రక్షణ బాధ్యత అందరిది

రాయగడ: అడవుల రక్షణ బాధ్యత అందరిపైనా ఉందని డిప్యూటీ రేంజర్లు అశోక్‌కుమార్ ప్రధాన్, దివ్య మాధురి అన్నారు. అడవుల రక్షణ, అగ్ని నివారణ అనే అంశంపై మారథాన్ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు.


స్వాగతం.. సుస్వాగతం...
శంఖారావం
మహాశక్తి
'తల్లికి వందనం' పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15,000
'ఆడబిడ్డ నిధి' నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ. 1,500
'దీపం' పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం
20 లక్షల మంది యువతకు ఉపాధి
నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి
బీసీలకు రక్షణ చట్టం తెచ్చి... వారికి అన్ని విధాలా అండ
ఇంటింటికీ సురక్షిత మంచినీరు
"ఇంటింటికీ మంచి నీరు" పథకం కింద ప్రతి ఇంటికీ రక్షిత త్రాగునీటి కుళాయి కనెక్షన్
పూర్ టు రిచ్
పేదలను సంపన్నులను చేసే P4
ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం
భవిష్యత్తుకు గ్యారెంటీ
సంక్షేమం అభివృద్ధి
ఇది బాబు గ్యారెంటీ
ఎన్నికల్లో భాగంగా "శంఖారావం" పూరించడానికి
నేడు సాలూరు నియోజకవర్గానికి విచ్చేయుచున్న
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి
గౌ॥శ్రీ నారా లోకేష్ గారికి స్వాగత శుభాకాంక్షలు..
ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,
అభిమానులు, యువత, మహిళలు, తెలుగుదేశం పార్టీ
కుటుంబసభ్యులు తరలిరావాల్సిందిగా కోరుచున్నాము.
మీ మిత్రులు, శ్రేయోభిలాషులు
పెంట తిరుపతిరావు
మాజీ సర్పంచ్, C.A.,
ఎ.వెంకంపేట
పెంట ఉమ B.Com
మాజీ ఎంపీపీ
సర్పంచ్, ఎ.వెంకంపేట